# చిన్న మనసు

మద్రాసు నుంచి తిరిగివస్తున్నప్పుడు తునిలో దిగాను.

మా కజిన్ భాస్కర్, తునిలో సూపర్‌వైజర్‌గా వుంటున్నాడు. నన్ను రమ్మని యెన్నోసార్లు వుత్తరాలు రాశాడు. ఇప్పటికి వీలు చిక్కింది.

ఆరోజు మధ్యాహ్నం ఇద్దరమూ భోజనాలు చేశాక, వేపచెట్టుకింద మంచాలు వేయించుకుని భుక్తాయాసం తీర్చుకుంటున్నాం.

"మీతో చదువుకున్న రాజశేఖరం ఇప్పుడిక్కడ ఇంజనీరుగా ఉంటున్నాడన్నయ్యా" అన్నాడు భాస్కర్.

రాజశేఖరంని గుర్తుకు తెచ్చుకుందుకు ప్రయత్నించాను. ఎప్పటి మాట? పాతికేళ్ళ క్రితం....

* * *

రాజశేఖరం శ్రీకాకుళం మునిసిపల్ హైస్కూల్లో నాతోపాటే చదువుకున్నాడు.

సన్నగా, పొడుగ్గా, చామన ఛాయలో ఉండేవాడు. ఎక్కువగా మాట్లాడేవాడుకాదు. అయితేనేం- చదువుల్లో దిట్ట. తెలివితేటలు పరిమితంగా ఉన్నా పరిశ్రమించేవాడు అధికంగా.

నిజం చెప్పుకోవాలంటే, చదువులో వాడికి నాకే పోటీగా ఉండేది. ఒక్కోసారి క్లాసు మొత్తం మీద నాకు ఎక్కువ మార్కులొస్తే, మరోసారి వాడికొచ్చేవి. అందుకే, మా ఇరువురికి రైవల్రీ ఉండేది. అది కేవలం చదువులోనే. మామూలుగా మేమిద్దరం మంచి స్నేహితులమే.

రాజశేఖరం మనసులో నాపట్ల ఎటువంటి భావం ఉండేదో నాకు తెలీదుగాని, నాకుమాత్రం వాడిపట్ల అసూయభావం ఉండేదికాదు. ఎందుకూ అంటే చదువుపట్లగల శ్రద్ధ, తీసుకున్న శ్రమను బట్టి పరీక్షా ఫలితా లుంటాయి కదా! ఒకరిమీద అసూయపడటంలో అర్థంలేదనిపించేది నాకు. నాకు, నాటకాలన్నా, పాటలన్నా, చిత్రలేఖనమన్నా, ఎంతో ఇష్టం. ఆ విభాగాల్లో నాకు ప్రవేశముండేది. రాజశేఖరంకి ఇవేమీ నచ్చేవికావు.

స్కూలు వార్షికోత్సవ సమయాల్లో, నాకు చదువుతోపాటు, పై కార్యక్రమాల్లో కూడా ప్రాముఖ్యత వస్తూ ఉండేది. అందులో నావి ప్లస్ మార్కులేకదా! అంచేత, రాజశేఖరంకి, నామీద గుర్రుగా ఉండేది. బైటికి కనబడనిచ్చే వాడుకాదు.

ఓసారి నలుగురు స్నేహితులం కలిసి, నాగావళి నదిఒడ్డుకి వెళ్ళి ఇసుకతిన్నెల మీద కూచున్నాం. మా నలుగురిలో రాజశేఖరం కూడా ఉన్నాడు.

నాగావళి సన్నగా శబ్దం చేసుకుంటూ ప్రవహిస్తోంది. నీటి మీంచి వస్తోన్న చల్లనిగాలి, మనస్సుకెంతో ఆహ్లాదం కలిగిస్తోంది. ఆ రోజంతా పడిన శ్రమ, ఆ చల్లగాలి ప్రభావంతో మటుమాయమైనట్టుగా అనిపించింది.

"ఒరేయ్ ప్రభాకర్, ఈ అనుకూల వాతావరణంలో, నువ్వో పాట పాడరా!" అన్నాడు, రాజేశ్వరరావు.

రాజశేఖరం తప్పించి, మిగిలిన ఇరువురు కూడా రాజేశ్వరరావుకి వంతపాడారు. నేను కాదనలేకపోయాను.

ఆ రోజుల్లో నేను ఘంటసాలగారి పాటలు అధికంగా అనుకరిస్తూ ఉండేవాణ్ని. నా గాత్రం, అంత గొప్పది కాకపోయినా, ఏదో వినదగ్గది

గానే ఉండేది. అందుకే, నా మిత్రుల్లో కొందరు అప్పుడప్పుడు నాచేత పాటలు పాడించేవారు. 'అమ్మా సరోజినీదేవీ' అన్న పాట పాడేను. ఎంతో భావయుక్తంగా అమరిపోయిందాపాట.

రాజశేఖరం తప్పించి, మిగిలిన ముగ్గురూ ఆ పాటని మెచ్చుకుని, నన్నభినందించారు.

"ప్రభాకర్, నువు గొప్ప అదృష్టవంతుడివిరా!" అన్నాడు, రాజేశ్వర్రావు.

రాజేశ్వర్రావుకి, నేనంటే ఓ విధమైన పిచ్చి అభిమానం.

"ఎందుకూ?" అన్నాను.

"చదువులో ఫస్టు. దానికితోడు నాటకాల్లో, పాటల్లో, చిత్రలేఖనంలో మన స్కూల్లో నీకు మించిన వాళ్లలేరు. సరస్వతీదేవికి నువ్వంటే ఎక్కువ వాత్సల్యమేమోననిపిస్తోందిరా! నువ్వు మా స్నేహితుడివని చెప్పుకోడానికి మేమెంతో గర్విస్తూ ఉంటాం" అన్నాడు, రాజేశ్వరరావు.

రాజశేఖరంకి, ఆ మాటలు కాస్తంత నొప్పించాయో, లేక నన్ను గురించిన పొగడ్త అతణ్ణి కృంగదీసిందో ఏమోగాని ఉన్నట్టుండి లేచి పోయాడు.

"చాలా వేళయ్యిందిరా! నేనొస్తాను" అన్నాడు.

"మేంకూడా వచ్చేస్తాంలేరా!" అన్నాన్నేను.

అయితేనేం – రాజేశ్వరరావు మిగిలిన ఇద్దరూ అప్పుడే వెళ్ళి పోడానికి ఇష్టపడ లేదు.

"వాడు వెళ్ళనీరా! మనం మరి కాస్సేపు కూచుందాం. వాతావరణం ఎంతో హాయిగా ఉంది" అన్నాడు రాజేశ్వర్రావు.

రాజశేఖరం వెళ్ళిపోయాడు. అతని మొహంలో ఎటువంటి మార్పు వచ్చిందో ఆ చీకట్లో కనిపించలేదు. వాడి మాటకి వాళ్ళెవరూ విలువివ్వ నందుకు బాధపడే ఉంటాడు. అది వాడి స్వభావం!

అప్పట్నించీ, రాజశేఖరం మా ముగ్గురితో కలిసి తిరగడం తగ్గించాడు. కాని, విరోధం ఎప్పుడూ లేదు. చదువులో మా ఇరువురి రైవల్రీ ఎప్పుడూ ఉండేది. ఒకర్ని అధిగమించాలని ఒకరం ప్రయత్ని స్తూనే ఉండేవాళ్ళం. ఆ రోజుల్లో ఇలా ఉండేవి చదువులు.

ఇల్లాంటి సంఘటనలు రాజశేఖరంతో ఎన్నో వున్నాయి. ప్రతి సంఘటనలోనూ అతని వింత ప్రవృత్తి ద్యోతకమౌతూ ఉండేది.

అట్లాంటి రాజశేఖరం సుళువుగా గుర్తుకొచ్చాడు.

*          *          *

"ఔను భాస్కర్! రాజశేఖరం, నేనూ మంచి స్నేహితులం. చదువులో మేము ఇద్దరం పోటీపడేవాళ్ళం. అలాగని వ్యక్తిగత జీవితంలో విరోధం ఎప్పుడూ ఉండేదికాదు. వాడు ఇంజనీరింగ్‌లో చేరాడని విన్నాననుకో! తర్వాత కలుసుకోవడం జరగలేదు. అయితే ఇప్పుడీ వూళ్ళో ఉన్నాడన్నమాట! మనం ఓసారి వెళ్దాం. వాణ్ణి కలుసుకుని చాలా రోజులయ్యిందికదా! చాలా రోజులేమిటి, చాలా సంవత్సరాలయ్యింది" అంటూ నా ఆసక్తిని తెలియజేశాను.

"నేను నీ కజిన్‌నని తెలిశాక, నీగురించి వివరాలడిగాడు" చెప్పాను. నువ్వు పైకి రాకపోయినందుకు, ఓ ఉన్నత స్థాయికి చేరుకోలేకపోయినందుకు బాధపడ్డాడుకూడా."

రాజశేఖరం కనబర్చింది, బాధా లేక ఓ విధమైన యెగతాళా, అని నేను నిర్ధారణ చేసుకోలేకపోయాను. అతని మనస్తత్వాన్ని కూలంకషంగా స్టడీ చేసినవాణ్ణిగనక, ఆ శంక వచ్చింది నాలో. అయితే, నాలో రేకెత్తిన ఈ అనుమానాన్ని బైటపెట్టలేదు.

"వాడి దగ్గరికి ఎప్పుడు వెళ్దామంటావు?" అడిగాను.

"ఇవ్వాళ సాయంకాలం వెళ్దామన్నయ్యా! ఎక్కువ దూరం కూడా కాదులే" అన్నాడు మావాడు.

"అట్లాగే."

*          *          *

ఆరోజు సాయంత్రం నాలుగున్నర గంటలకి నేనూ, భాస్కర్ బయల్దేరాం.

అది నవంబరు కావడంవల్ల, చల్లగావుంది వాతావారణం. ఆకాశం నిర్మలంగా ఉంది. వల్చని చలిగాలి ప్రారంభమయ్యింది.

"రిక్షాలో వెళ్దామా?" అన్నాను.

"అబ్బే! ఎందుకన్నయ్యా! హాయిగా నడుచుకుంటూ వెళ్తేనే సుఖంగా ఉంటుంది. ఇక్కడ రిక్షాలు చూశావు కదా? దేనికీ సరైన సీటు ఉండదు."

నాకూ అలానే అనిపించింది.

నాలో రాజశేఖరంని కలవాలన్న ఆరాటం అధికమౌతోంది. అది సహజమే! చిన్ననాటి స్నేహితులం....ఎన్నో ఏళ్ళనుంచి కలుసుకోలేదు.

నేనూ, భాస్కర్ మాట్లాడుకుంటూ వెళ్ళడం వల్ల, పెద్దదూరం అనిపించలేదుగాని, నిజానికి దూరమే!

"అదిగో, ఆ కనిపిస్తోన్న బంగళాయే అన్నయ్యా" చూపించాడు భాస్కర్.

బంగళా దగ్గరికి వచ్చేశాం.

ముందుభాగంలో చక్కని గార్డెన్‌తో బంగళా అందంగా అగుపిస్తోంది.

చేతి వాచీ చూసుకున్నాను. అయిదుగంటల అయిదు నిముషాలయ్యింది. అంటే మేం నడిచి వచ్చిన దూరమెంతో అర్థమైంది నాకు. నాలో నేనే నవ్వుకున్నాను.

గార్డెన్‌లో కుర్చీలు వేసుకుని కూచున్నారు, రాజశేఖరం, అతని భార్యామణి గామోసు. మమ్మల్ని చూడగానే ఆహ్వానించాడు రాజశేఖరం.

"రండి భాస్కర్‌గారూ" అని

బహుశా, నన్ను గుర్తుపట్టలేదనుకున్నాను. రాజశేఖరంలో బాగా మార్పువచ్చింది. మనిషిప్పుడు బాగా లావెక్కాడు. చెక్కిళ్ళు ఉబ్బి ఉన్నయ్, కాస్త బట్టతల కూడా వచ్చేసింది.

నేనూ, భాస్కర్, వాడికి దగ్గరగా వెళ్ళాం నేను సందిగ్ధంలో పడ్డాను "నమస్తే" అని అనడమా, మానడమా అని. అలా అనడానికి నా మనస్సు ఎదురు తిరిగింది. చిన్ననాటి స్నేహితుడికి "నమస్తే" అని అనడమేమిటి అనుకున్నాను.

రాజశేఖరం భార్య, వింతగా చూస్తోంది. నేను సభ్యత పాటించలేదని గామోసు! రాజశేఖరమూ అలా విస్తుపోయాడేమో, నాకు అర్థంకాలేదు.

"కూర్చోండి" అన్నాడు రాజశేఖరం.

నాలుగు కుర్చీలు ఖాళీగా ఉన్నయ్. రాజశేఖరంకి అభిముఖంగా ఉన్న రెండు కుర్చీల్లో ఆశీనులమయ్యాం.

"రాజశేఖరంగారూ! మీతో చెప్పానుకదండీ మాకజిన్ వస్తాదని.... ఈయనే మా అన్నయ్య మీ క్లాస్‌మేట్ ప్రభాకర్" అంటూ పరిచయం చేశాడు భాస్కర్.

"ఇన్నేళ్ళ తర్వాత నిన్ను కలుసుకోవడం చాలా ఆనందంగా వుందిరా రాజశేఖరం" అన్నాను చెయ్యి కలుపుతూ, సన్నని మందహాసంతో.

"నిన్ను చూస్తూనే అనుకున్నాన్లే, నువ్వు ప్రభాకర్‌వే అయ్యుంటావని. నీలో ఎక్కువగా మార్పు రాలేదురా" మామూలుగానే అన్నాడు రాజశేఖరం.

వాడిలో చెప్పుకోదగ్గ ఉత్సుకత అగుపించలేదు నాకు.

"నీలో మాత్రం బాగా మార్పు వచ్చిందిలే. ఉద్యోగంతోపాటు నీ శరీరాన్ని కూడా పెంచేసుకున్నావు" అన్నాను.

దానికి వాడేవీఁ రియాక్టు అవ్వలేదు.

రాజశేఖరం భార్యకేసి తిరిగాడు.

"అనూరాధా, నీకు గుర్తుందా? నీతో చెప్తూ ఉండేవాణ్ని నా స్నేహితుడు ప్రభాకర్ అని ఉండేవాడని మా ఇరువురికీ చదువులో పోటీ ఉండేదనీ! వాడే వీడు....ప్రభాకర్, ఈమె నా శ్రీమతి" అంటూ ఒకర్నొకరికి పరిచయం చేశాడు.

"నమస్తే" అన్నాను తప్పనిసరిగ. అది సభ్యత కూడాను.

"నమస్తే! మీ గురించి చెప్తూండేవారులెండి ఇప్పుడేం చేస్తున్నారు మీరు".

"కలకత్తాలో ఉన్నానండీ"

"ఇంజనీరుగానా?" ఆమె ప్రశ్న.

"అబ్బే! అంతదూరం పోలేదండీ! నాకు అవకాశం లేకపోయింది. హైస్కూలు చదువుతోనే ఆపేశాను. రైల్వేలో స్టెనోగ్రాఫర్‌గా ఉంటున్నాను."

"ఓ అట్లాగా?" అంది "మీ తెలివితేటలన్నీ మూలబడిపోయా యన్నమాట?"

"అన్నమాటే కదండీ! దేనికయినా అదృష్టం ఉండాలికదా?"

"ఆ వాదనకి నేనొప్పుకోను. పట్టుదల ఉండాలి. పట్టుదల ఉంటే, ఒక లక్ష్యం ఉంటే, ఆ లక్ష్యసాధనకు ప్రయత్నమంటూ ఉంటుంది" అందామె.

భార్య ఆ విషయంలో ఇంక చర్చించడం ఇష్టంలేకపోయిందేమో రాజశేఖరంకి. మధ్యలో అందుకొన్నాడు "మేం హైస్కూల్లో చదువుకున్న రోజుల్లో మేం ఇరువురం చదువులో పోటీపడేవాళ్ళం అనూ! నాకంటే పైనే ఉండాలని ప్రయత్నించేవాడు ప్రభాకర్. కాని ఎల్లప్పుడూ సాధ్య పడేదికాదు. ఒక్కొక్కప్పుడు వీడు పైనుంటే, మరొకప్పుడు నేనుండే వాణ్ని హైస్కూలు చదువు పూర్తయ్యాక, నేను కాలేజీకి పోతే వీడేమో, ఉద్యోగానికి, అదీ పరరాష్ట్రానికి పోయాడు. ఇంక, పోటీ ప్రశ్నేలేదు" నవ్వుతూ అన్నాడు రాజశేఖరం.

రాజశేఖరం అలా ఎందుకన్నాడో, నా ఒక్కడికే అర్థమయ్యింది. అంటే, నాకంటె వాడిప్పుడు పైనే ఉన్నాడని వాడి అభిప్రాయం కాదని ఎవరనగలరు? నాకు నవ్వొచ్చింది. వాడింకా అర్థం చేసుకోలేదు- ఉద్యోగం లోని అంతస్తు ఒక్కటే అంతస్తు కాదని-

అనూరాధ, అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయింది యింట్లోకి. బహుశా, వాళ్ళ అంతస్తుకి దీటైన వాణ్ణి కాదనేమో అలా వెళ్ళిపోయింది. అది నాలో కలిగిన అనుమానమే. అయితేనేం-ఆ విషయాన్ని అంతగా పట్టించుకో లేదు.

"ఇంక విశేషాలేవిట్రా రాజశేఖర!" అన్నాను, నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ.

"చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవనుకో! కొద్దిరోజుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా నాకు ప్రమోషన్ దొరకబోతోంది. బహుశా, ఇక్కడకు బదిలీకూడా అవ్వొచ్చు"

"అదేవిటండీ రాజశేఖరంగారూ, మీరు ప్రమోషను దొరికినా ఇక్కడే ఉంటారని అందరూ అంటుంటేనూ" అన్నాడు మా కజిన్,

"అది ఇప్పుడే చెప్పలేమండి."

"మన పాత మిత్రులెవరైనా కలుస్తున్నారా?" ఆసక్తిగా అడిగాను.

"ఈ మధ్యన యెవ్వరూ కలియలేదురా! రాజేశ్వరావు మాత్రం ఓసారెప్పుడో విశాఖలో కలిశాడు. వాడు శ్రీకాకుళంలోనే రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగా ఉంటున్నాట్ట. అంతకంటె పైకి పోవడానికి వాడికి అవకాశాలు రావడంలేదని వాపోయాడు. ఆ మధ్య ఓ ఉత్తరం కూడా రాశాడు నాకు, కానీ, నేను జవాబివ్వలేదు...." అదో ఘనకార్యంలా చెప్పాడు.

"అదేంరా? చిన్ననాటి మిత్రుడవని ఉత్తరం రాశాడు. నువ్వు జవాబివ్వకపోతే, యెంతగా బాధపడతాడని?" అన్నాను.

రాజశేఖరం, సన్నగా నవ్వేడు. జవాబివ్వనందుకు, తానేం బాధపడ్డం లేదన్నట్టుగా ఉందా నువ్వు.

"స్నేహితుడు ఓ అంతస్తులో ఉంటే, వాడితో పరిచయాన్ని పెంచుకోడానికి, కలియడానికి, ప్రయత్నిస్తూ ఉంటార్రా చాలామంది. కాని, గడిచిన రోజుల్లో, ఆ స్నేహితుణ్ణే ఎంత నిర్లక్ష్యం చేసేవారో, వాళ్ళిప్పుడు గుర్తుకు తెచ్చుకోరు. అంతా స్వార్థం" అన్నాడు, కసిగా, రాజశేఖరం.

రాజశేఖరం మాటల్లోని గూఢార్థం, నాకు అవగతమయ్యిందిగాని, మా భాస్కర్‌కి అర్థమై ఉండకపోవచ్చు. మేం హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో, స్నేహితులు నన్ను మెచ్చుకొని రాజశేఖరాన్ని నిర్లక్ష్యం చేసేవారు. అది వాడి గుండెల్లో బాగా హత్తుకొనిపోయి ఉన్నట్టుంది. ప్రతీకారంగా, ఇప్పుడీ విధంగా తిప్పికొడుతున్నాడన్నమాట! అయితే, ఈ మాటలు, నాకూ వర్తిస్తున్నట్టేనా? సందేహం కలిగింది. దాంతోపాటు కాస్తంత వొళ్ళు ఝుల్లుమంది.

"స్నేహితుడు ఓ అంతస్తులోవుంటే ఎవరికయినా ఒరిగేదేవిట్రా రాజశేఖరం? ఏమీలేదు అదృష్టం కలిసొచ్చి, వాడా అంతస్తులో ఉన్నాడని

ఆనందిస్తారు. అలా భావించే రాజేశ్వర్రావూ ఉత్తరం రాశాడు. ఆ రోజుల్లో ఏం జరిగిందీ నెమరువేసుకోవడం ఇప్పుడనవసరం. మనందరం స్నేహితులం. వాడికి జవాబివ్వవడం స్నేహధర్మం..."

రాజశేఖరం మళ్ళీ నవ్వేడు. ఆ నవ్వులో స్నేహభావం ఎక్కడా అగుపించలేదు. అహం కొట్టొచ్చినట్టు ద్యోతకమౌతోంది.

అదేం స్నేహధర్మంరా? వాడికేదో అవసరం ఉందిగామోసు, నన్నాశ్రయించబోతున్నాడు. అయినా, అదెప్పటి స్నేహం? ఎప్పుడో చిన్ననాటి స్నేహం. దానికి విలువేవిఁటి ఇప్పటి నా అంతస్తువేరు, నా స్నేహితులు వేరు. స్నేహానికి కూడా ఓ అంతస్తు ఉండాలికదా? ప్రతి వాడూ స్నేహితుడని చెప్పుకుంటే ఇంకేముంది?"

రాజశేఖరం మాటలు నాకు జుగుప్స కలిగించాయి. ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్టనిపించింది. వాడు యెంత దిగజారిపోయాడో అర్థ మయ్యింది అది కేవలం అంతస్తు, డబ్బు తెచ్చిన అహంభావం. ధన మధాంతత నీలితెర, వాడి కళ్ళను కప్పేసింది. వాడికిప్పుడు కనిపిస్తున్న దంతా అంతస్తూ డబ్బే! ఆ పరిస్థితుల్లో వాడి దృష్టిలో స్నేహానికున్న విలువలే మారిపోయాయి. ఆ పదానికున్న అర్థమే తారుమారయ్యింది. నా అంతరంగంలో అగ్నిపర్వతం బ్రద్దలయినట్టయ్యింది.

"రాజశేఖరం, నీలో అంతస్తే పెరిగిందిగాని ఆత్మీయత, అభి మానం యివన్నీ తరిగిపోయాయిరా! నీ మాటలు నన్ను బాధిస్తున్నయ్‌రా- ఆలోచింపజేస్తున్నయ్. స్నేహితుడివని, చాలా రోజుల తర్వాత కలుసు కుంటున్నామన్న ఆతృతతో వచ్చాను. నాకూ అంతస్తు లేదు. నేను కేవలం ఓ స్టెనోగ్రాఫర్ని. అంటే, నిన్ను కలియడానికి నేనూ రాకూడదన్న మాట...." సూటిగా ప్రశ్నించాను.

"అని, నేను అననుగాని, నువ్వే గ్రహించాలి" ముక్తసరిగా అన్నాడు రాజశేఖరం.

నాకు వొళ్ళంతా కారం పూసుకున్నట్టయ్యింది. ఆనాటి రైవల్రీ చదువులో ఇప్పటి రైవల్రీ అంతస్తులోనన్నమాట.... అనిపించింది నాకు.

నా కళ్ళలోంచి ఆవిర్లు విరజిమ్ముతున్నాయి. సహనం పట్టు తప్పు తోంది. ఛీ! ఛీ!! ఏం సంస్కారం వీడిది?"

ఒక్కక్షణం అక్కడ వుండాలనిపించలేదు, భాస్కర్ నాలో వచ్చిన మార్పు గమనించి కంగారుపడుతున్నాడు. ఏ అగ్నిపర్వతం బ్రద్దలవుతుందోనని, వాడి భయం!

విసురుగా లేచి నుంచున్నాను.

"చూడు రాజశేఖరం! స్నేహానికున్న పవిత్రత అందరికీ అర్థం కాదు. అందులోనూ నీలాంటి డబ్బుమనిషికి, ఆడంబరాలికి అలవాటుపడ్డ వారికి, మరీ అర్థంకాదు. అంతస్తు, కేవలం ఉద్యోగంతోను, డబ్బుతోను రాదు. అది గ్రహించుకో! మనిషి, మనిషిగా ప్రవర్తించడమే గొప్ప అంతస్తు. 'స్నేహం' అన్న పదానికే కళంకం ఆపాదించావు నువ్వు. నువ్వు స్నేహితుడివన్న విషయాన్ని యీ రోజునుంచి మర్చిపోతున్నాను, అండర్ స్టాండ్! అంతస్తుగల స్నేహితులతోనే, ఆత్మీయతలు కరువయ్యే రాజ్యాన్ని సృష్టించుకో! నీలాంటివాడు స్నేహితుడున్నాడని చెప్పుకోడానికే మాకు సిగ్గు.... గుడ్ బై...." అంటూ బైటికి నడిచాను.

'టీ' పట్టుకుని వచ్చాడు పనివాడు.

భాస్కర్ కూడా 'టీ' తీసుకోకుండా వచ్చేయడం, బహుశా డబ్బు మనిషి రాజశేఖరంకి, వింతగా తోచివుండొచ్చు – వచ్చేస్తూ, భాస్కర్ అన్నమాటలు నాకు వినిపించాయి.

"సారీ రాజశేఖరంగారూ! స్నేహంపట్ల, స్నేహితులపట్ల మీకున్న విలువేవిఁటో మీ భావనేవిఁటో, యీరోజు నాకు అర్థమయ్యిందండీ! మీరెప్పుడూ మంచి స్నేహితులు కాలేరు. ఐ హేట్ యూ!" అని.

రాజశేఖరం తెల్లమొహం వేసివుంటాడు.

భాస్కర్ బైటికి వస్తూ –

"బాగా బుద్ధిచెప్పావన్నయ్యా! వీడు ఇట్లాంటి వెధవని నాకు తెలీదు సుమా! అనవసరంగా నిన్ను తీసుకొచ్చి, నీ మూడ్స్ పాడుచేశాను" బాధ పడ్డాడు, భాస్కర్.

చిన్నగా నవ్వేశాను.

"అదంతా మర్చిపో భాస్కర్! మనం మామూలు మనుషులం అయిపోదాం. వాడి జ్ఞాపకాల్ని యిక్కడే సమాధిచేసి పోతున్నాం" వడిగా ముందుకు సాగాను.

భాస్కర్ వెనక్కితిరిగి చూశాడు. "ఆ వెధవ నించుని చూస్తున్నాడన్నయ్యా!"

"చావనీ వెధవ! ఎవడిక్కావాలి వాడి విషయం" అనేశాను.

నవ్వుకున్నాం యిద్దరమూను.

* స్వాతి, సవరి వారపత్రిక, 8-11-1985 *